

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**నేను ఎంతో** ఉత్సాహంతో టెక్స్ట్ బుక్స్ తెరిచాను కానీ సగం అర్థంకాలేదు. గూగుల్‌లో డెరివేషన్స్ చూసుకుంటూ అర్థం చేసుకునే ప్రయత్నం చేసాను. ఒక చాప్టర్ పూర్తిచేసేసరికి చాలాసేపు పట్టింది. బుర్ర వేడెక్కింది. ఆకలివేసింది. కాస్త అసహనంకలిగింది. బుక్కుమూసి కాసేపు బయట మెట్లమీద కూర్చున్నాను. చాలామంది ఇండియన్స్ అలా మెట్లమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళెవ్వరూ నాకు తెలియదు. వాళ్ళకి నేను తెలుసో లేదో నాకు తెలియదు. కానీ అలా బయట కూర్చుంటే కాస్త ప్రశాంతంగా అనిపించింది. అప్పుడే ఎండ తగ్గి సూర్యాస్తమయం కాబోతుంది. ఆకాశం రంగులు మారాయి. ఇంట్లో సాయంత్రాలు నేనూ అమ్మ ఆరు బయట కూర్చుని కబుర్లు చెప్పుకోవడం గుర్తొచ్చి కళ్ళల్లో నీరు తిరిగింది. ఆఖరిసారి నేను, అమ్మ అలా కబుర్లు చెప్పుకుంది ఇండియానుండి బయలుదేరే మూడురోజులముందు.

"జాగ్రత్తగా ఉండు. ఎవ్వరితో గొడవలు పెట్టుకోకు" అంది.

"నేనేమైనా చిన్నపిల్లనా అందరితో గొడవపెట్టుకోడానికి?" నవ్వాను.

"నువ్వు పెట్టుకోవులే. కాని ఏవరైనా గొడవపడితే అక్కడినుండి వెళ్ళిపో."

"సరే."

"సమయానికి భోంచెయ్యి. నేను ఇచ్చిన రెసిపీలుతో వంట చేసుకో. అవి రెండు నిమిషాల్లో అయిపోతాయి."

"సరే."

ఏమైనా కావాలంటే అన్నయ్యకి ఫోన్ చెయ్యి"

"సరే"

"అన్నయ్య దగ్గర ఉన్న కాలేజీలో చదవచ్చుగా? నాకూ నిశ్చింతగ ఉంటుంది."

"అక్కర్లేదు. ఒక్కదాన్నే ఉంటా."

"నువ్వు సినిమాల్లో చూసి బావుంటుందనుకుంటున్నావు. కానీ ఒక్కళ్ళే ఉండడం చాలా కష్టం"

"నేనేమీ సినిమాలు చూసి నిర్ణయం తీసుకోలేదు"

"నువ్వు తీసుకుని ఉండకపోవచ్చు. కానీ ఒక్కళ్ళు ఉండడం ఈజీకాదు."

"తెలుసు. అన్నయ్య ఒక్కడే ఉన్నాడుగా? నేనూ ఉండగలను."

"అన్నయ్య వేరు, నువ్వు వేరు."

"నువ్వు ఎప్పుడూ అన్నయ్యనే సపోర్ట్ చేస్తావు. అన్నయ్య ఏదైనా విరక్కొట్టినా తన తప్పులేదు, ఆ వస్తువే అన్నయ్య చేతుల్లో ఆత్మహత్య చేసుకుంది అంటావు."

అమ్మ నవ్వింది. కాసేపు నిశ్శబ్దం తరవాత "రోజూ ఫోన్ చేస్తూ ఉండు. అన్నయ్యకి, నాకూ ఇద్దరికీ"

"సరే. చేస్తాను"

"హేయ్, నువ్వు అవని కదా?" నా ఆలోచనలోంచి ఉలిక్కిపడి చూసాను ఇతన్ని ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. హనీష నాగురించి చెప్పుంటుంది.

"యా. హాయ్" బదులిచ్చాను.

"హనీష ఉందా?"

"లేదు. బయటకి వెళ్ళింది."

"ఎప్పుడు వస్తుంది?"

"తెలీదు"

"నువ్వు ఏరోస్పేస్ కదా?"

"యా ఔను."

"విన్నాను జాబ్ వచ్చిందంట?"

"యా"

"కంగ్రాచులేషన్స్. ఫస్ట్ సెమిస్టర్‌లో జాబ్ రావడం చాలా కష్టం."

"థాంక్స్"

"హనీష వస్తే నేను వచ్చానని చెప్పు."

"నీ పేరు?"

"రామ్. ఆ ఆపోజిట్ ఇంట్లో ఉంటాను."

"ఓకే. చెప్తాను."

"ఆర్ యూ ఓకే?"

"యా" ఆశ్చర్యపోయాను.

"ఏం లేదు నువ్వు ఏడుస్తున్నావు కదా, అంతా ఓకేనా అని అడుగుతున్నా"

చంపను తాకితే కళ్ళల్లోంచి నీళ్ళు కారాయని తెలిసింది.

"యా. ఏదో గుర్తొచ్చింది" చిన్నబోతూ కళ్ళు తుడుచుకున్నాను.

"హోం సిక్‌నెస్సా? అందరూ అంతేలే. ఏంకాదు. అలవాటైపోతుంది"

తలుపాను. అతను తిరిగి వెళ్ళబోతుంటే తలుపు తెరుచుకుంది.

"హేయ్, మీరిద్దరూ ముందే ఫ్రెండ్సా?" హనీష అడుగుతూ వచ్చింది.

"లేదు" గబుక్కున అన్నాను. నేను ఏడ్చానని చెపితే పరువు పోతుంది.

నా ఆలోచన వినబడినట్టే "ఒక్కటే కూర్చుంటే పరిచయం చేసుకుందామని వచ్చాను" అన్నాడు.

"థాంక్స్" అన్నట్టుగా తలూపాను. అర్థం చేసుకుని అతనూ తలూపి బదులిచ్చాడు.

"రామ్ ఈ సెమిస్టర్ గ్రాడ్యుయేట్ అయిపోతున్నాడు. ఎలక్ట్రానిక్స్‌లో మాస్టర్స్" హనీష చెప్పింది.

"ఓ.ఓకే" అన్నాను.

"జాబ్ వచ్చిందా?" రామ్ ని అడిగింది.

"యా. వచ్చినట్టే" సంతోషంగా చెప్పాడు.

"కంగ్రాజ్యులేషన్స్" అన్నాను.

"థాంక్యూ, థాంక్యూ"

"వీళ్ళందరూ సాయంత్రం అయితేచాలు, ఊళ్ళల్లో అవ్వల్లాగా ఆ చెట్టుకింద కూర్చుని అమ్మలక్కల్లా కబుర్లు చెప్పుకుంటారు" హనీష అంది.

నేను నవ్వాను.

"ఇంకేం చేస్తాం మరి? నీలాగా మాకు అంత సోషల్ లైఫ్ లేదుగా" బదులిచ్చాడు.

"ఏం మాట్లాడుకుంటారు ఇంతకి?" అడిగింది.

"ఏముంది? క్లాసులు ఎలా అవుతున్నాయి, జాబ్ సెర్చ్‌లు, ఏం వండుకున్నారు?" ఇలాంటివి.

"వంట?" పెద్దగా నవ్వింది హనీష.

"ఔను. ఎవరింట్లో ఏం వండారు, రుచి ఎలా వుంది, రెసిపీలు, ఇండియానించి ఏమైనా పంపారా?" ఇలాంటివి.

నేను పెద్దగా నవ్వాను.

"ఇవాళ మెనూ ఏంటి?" నవ్వుతూ అడికాను.

"రాకేష్ వాళ్ళ ఇంట్లో చికెన్ చేసారు, ముత్తు వాళ్ళు పప్పుచారు, రోషిణి వాళ్ళు బిరియానీ చేసారు, రిషి వాళ్ళు వంట చేసారు కానీ స్టవ్ ఆపడం మర్చిపొయారు. అంతా మాడిపోయింది."

నేనూ, హనీష పగలబడి నవ్వాం. కానీ మేము ఎందుకు నవ్వుతున్నామో అతనికి అర్ధం కాలేదు.

"బిరియానీ ఎలా ఉంది?" నవ్వుతూనే అడిగింది హనీష.

"తెలీదు. డబ్బా తెస్తున్నారు"

నేను దాదాపు కింద పడేలా నవ్వాను.

మా ఇద్దరి నవ్వూ చూసి అతను చిన్నబోయాడు.

"నేను వెళ్తాను" అన్నాడు.

ఇద్దరం నవ్వుతూనే బై చెప్పాము.

అతను వెళ్ళిన కొద్దిసేపటికి మా నవ్వు ఆగగానే "అతను మంచివాడు. ట్రస్ట్ వర్తీ. ఏదైనా హెల్ప్ అడిగితే తప్పకుండా చేస్తాడు" అంది.

"ఓకే"

"తను పాపం చాలా కష్టపడ్డాడు. తన చిన్నప్పుడు వాళ్ళ నాన్నా, అమ్మ డివోర్స్ తీసుకున్నారు. వాళ్ళ అమ్మ బ్యాంక్ ఆఫీసర్. ఒక్కతే కష్టపడి పెంచింది. చుట్టాలు ఎవరూ దగ్గరికి వచ్చేవాళ్ళు కాదట. కేవలం అమ్మమ్మ,తాతయ్య మాత్రమే ఉండేవారు వాళ్ళ అమ్మ రోజూ ఏడ్చేదట. అవన్నీ చూస్తూ పెరగడం వల్ల చాలా రెస్పాన్సిబుల్ అయ్యాడు. ఎవర్నీ జడ్జ్

చెయ్యడు. వాళ్ళ అమ్మ లోన్ తీసుకుని అమెరికాకి పంపింది. ఆడ్ జాబ్స్ చేస్తూ ఇంటికి డబ్బులు కూడా పంపుతున్నాడు. చాలా మంచబ్బాయి."

ఎంతో జాలికలిగింది. నేను ఏడుస్తుంటే ఎవరో తెలీకుండానే వచ్చి ఎందుకు మాట్లాడాడో అర్థమైంది. "అయ్యో, ఔనా పాపం" అన్నాను

"యా ఒకసారి వాళ్ళ అమ్మకి ఏక్సిడెంట్ అయ్యింది. అప్పుడు చాలా డిస్టర్బ్ అయ్యాడు. వాళ్ళ అమ్మకి చెయ్యి ఫ్రాక్చర్ అయ్యింది. దానికే ఐసియూలో ఉన్నంత టెన్షన్ పడిపోయాడు. అప్పుడు చెప్పాడు ఇవన్నీ. అప్పటివరకు నాకు ఏమీ తెలియవు. వాళ్ళ అమ్మే తన ప్రపంచం."

"ఓ.. అయ్యో" ఎంతో జాలితో పాటు రెస్పెక్ట్ కూడా కలిగింది.

ఇద్దరం కాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాము.

ఇంతలో వెన్నెల వచ్చింది. ముగ్గురం అలానే కూర్చుని  చీకటయ్యేంతసేపు మాట్లాడుకున్నాము. నాకు ప్రొఫెసర్ టెక్స్ట్ బుక్స్ ఇచ్చిన సంగతి చెప్పాను.

వెన్నెల సహాయం చేస్తానని చెప్పడంతో ఎంతో ఆనందించాను. మనసు కుదుట పడింది. ముగ్గురం లోపలికి వెళ్ళబోతుంటే రామ్ వచ్చాడు.

"హేయ్, ఇదిగో బిరియాని" ఒక డబ్బా హనీషకి ఇచ్చాడు.

నేను ఆశ్చర్యపోయాను. మేము అంత నవ్వినా మళ్ళీ వచ్చాడు. అదికూడా  డబ్బా తీసుకుని మరీ అని ఆశ్చర్యపోయాను.

"లోపలికిరా. ఒక స్పూన్ తిని ఇస్తాను" హనీష అంది.

నిజానికి ఆ బిరియాని చాలా రుచిగా ఉంది.

"మీకోసమే తెచ్చాను. మావాళ్ళు వండుతున్నారు. నేను ఇంటికి వెళ్ళి తింటా" అన్నాడు.

"మాతో కొంచెం తిను" అని వెన్నెల అనడంతో 'సరే ' అన్నాడు.

నలుగురం కలిసి కబుర్లు  చెప్పుకుంటూ ఆ రుచికరమైన బిరియాని తిన్నాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story